నమస్తే తెలంగాణ

# జనగామ

5 | వరంగల్, సోమవారం 28 అక్టోబర్ 2024 | JANAGAON


ఆసియాలో అతిపెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయం బాగానే వస్తున్నా మౌలిక వసతులు కరువయ్యాయి. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.43.39 కోట్ల ఆదాయం వచ్చినా రైతులను సమస్యలు వెక్కిరిస్తున్నాయి. మార్కెట్‌లో నిఘా కొరవడడంతో యార్డుల్లో పంట ఉత్పత్తుల చోరీ జరుగుతున్నది. సీసీ కెమెరాలు పనిచేయకపోగా, కొత్తవి అమర్చడంతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కనబరుస్తున్నది. కనీసం తాగునీరు అందుబాటులో లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్‌లో సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

*- వరంగల్, అక్టోబర్ 27 (నమస్తేతెలంగాణ)*




ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన ద్వారం

# ఆదాయం ఘనం వసతులు అధ్వానం

- కొరవడిన నిఘా.. యార్డుల్లో పంట ఉత్పత్తుల చోరీ
- పనిచేయని సీసీ కెమెరాలు.. కొత్తవి అమర్చని వైనం
- తాగునీరు అందుబాటులో లేక అల్లాడుతున్న రైతులు
- రైతుల విశ్రాంతి భవనం నిర్వహణపై నిర్లక్ష్యం

## ఎనుమాముల మార్కెటల్‌లో మౌలిక సదుపాయాలు కరువు

ఎనుమాముల మార్కెట్‌లో మిర్చి, పత్తి యార్డుల్లో పంట ఉత్పత్తుల చోరీ జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతు సంఘాల ప్రతినిధులు నిరసిస్తున్నారు. గతంలో మార్కెట్ ప్రధాన గేటు, కార్యాలయంతో పాటు మరికొన్ని చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఎక్కువగా పనిచేయడం లేదు. వాటి స్థానంలో, యార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఇటీవల మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా మార్కెట్ ఆవరణలో 252 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించినా ఆచరణలోకి రాలేదు.



**ప్రతిపాదనల్లోనే క్లీనింగ్ మిషన్స్**

పరిశుభ్రతపై కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ పరిశుభ్రత కోసం క్లీనింగ్ మిషన్లు సమకూర్చాలని పలుమార్లు చాంబర్, రైతు సంఘాల ప్రతినిధులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను కోరినా ఇప్పటికీ ప్రభుత్వం వాటిని సమకూర్చలేదు. వీటిని అందుబాటులోకి తెస్తే మార్కెట్ యార్డులు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టర్ల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు.

### నిర్వహణపై నిర్లక్ష్యం

మార్కెట్ నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. యార్డుల్లో కనీసం రైతులకు తాగునీటి వసతి కల్పించని పరిస్థితి నెలకొంది. దీంతో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. టాయిలెట్ల నిర్వహణ సరిగా లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక మహిళా రైతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు లేవు. రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ కూడా అటకెక్కింది. బెడ్స్ పాడై ఉండగా తాగునీటి వంటి వసతి లేదు. కొన్ని సందర్భాల్లో రైతులు బెడ్స్‌పై పడుకోలేక విశ్రాంతి భవనంలోని గదుల్లో నేలపై పడుకుంటున్నట్లు తెలిసింది.



రైతు విశ్రాంతి భవనం

యార్డుల్లో ఎల్రక్టానిక్ కాంటాలపై రైతుల పంట ఉత్పత్తులను తూకం వేయడంలో ఇంటర్నెట్ సమస్య వెంటాడుతోంది. వైఫై మెరుగుపరచాలనే ప్రతిపాదన కూడా అమల్లోకి తేలేదు. మార్కెట్ నిర్వహణ కోసం ప్రభుత్వం 109 రెగ్యులర్ ఉద్యోగుల పోస్టులను మంజూరు చేయగా ప్రస్తుతం సెక్రటరీ సహా 31 మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగులను తీసుకుని మార్కెట్‌ను నిర్వహిస్తున్నది. అభివృద్ధి కోసం మార్కెట్ ఆవరణలో చేపట్టిన నిర్మాణ పనులూ అసంపూర్తిగా నిలిచిపోయాయి. సమస్యలపై మార్కెట్ కార్యదర్శి నిర్మలను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.



ఉప్పల్‌లో ఆరబోసిన సన్నరకం ధాన్యాన్ని నేర్పుతున్న రైతు

# బోనస్.. బోగస్

**దళారులకు చేరుతున్న సన్న ధాన్యం**

- రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- పెట్టుబడి ఎక్కువైనా సన్న రకం సాగు చేసిన రైతులు
- పంట చేతికొచ్చినా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- గన్నీ సంచులు.. మిల్లుల కేటాయింపులు లేవు..
- రోడ్లపై ఆరబోసుకొని.. ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాత

కమలాపూర్, అక్టోబర్ 27 : సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ బోగస్‌గా మారింది. పంట చేతికొచ్చినా కొనే దిక్కులేకపోవడంతో ధాన్యం దళారులకు చేరుతున్నది. ఈ వానకాలం నుంచే బోనస్ ఇస్తామని చెప్పడంతో పెట్టుబడి ఎక్కువైనా ఆశతో రైతులు సన్నాలు సాగు చేశారు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందోనని రోడ్లపై వడ్లు ఆరబోసుకొని రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్కారు ప్రారంభించింది. కానీ, వారం రోజులు గడిచినా గన్నీ సంచులు అందుబాటులో లేకపోగా.. రైస్ మిల్లుల కేటాయింపు కూడా జరగలేదు. ప్రభుత్వం దొడ్డు రకం ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ. 2,320, బీ గ్రేడ్‌కు రూ. 2,300 ప్రకటించింది. సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తే క్వింటాకు రూ. 2,800 రైతులకు దక్కనుండగా, దళారులు మాత్రం రూ. 2,600కే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు అక్కడక్కడా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులపై ప్రశ్నిస్తున్న రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాగా, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల, గూడూరు, ఉప్పల్, మరిపెల్లిగూడెం, గుండేడు, కన్నూరు, భీంపల్లి, శంభునిపల్లి, కానిపర్తి, దేశరాజ్‌పల్లి తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా కొనసాగుతుండగా, కేవలం కమలాపూర్, ఉప్పల్, గూడూరుల్లోనే అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### బోనస్‌కు ఆశపడి సన్నాలు సాగుచేశా



నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తామంటే ఆశపడి బీపీటీ రకం వరి సాగుచేశా. సన్న రకం కావడంతో ఎకరాకు సుమారు రూ. 30 వేల వరకు పెట్టుబడి అయ్యింది. వరి కోసి నాలుగు రోజులైనా కొనేవాళ్లు లేకపోవడంతో దళారులకు అమ్ముకుంటున్నం. దళారులు ప్రభుత్వం ఇచ్చే బోనస్ కలిపి కొనుగోలు చేస్తామని చెప్పి అంతా అయ్యాక రూ. 200 కోత పెడుతున్నరు.

– ఎర్రబెల్లి వేణురావు, రైతు

### బోనస్ పేరుతో మోసం



కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ పేరుతో మోసం చేసింది. నాకు ఐదెకరాల పొలం ఉంటే బోనస్ వస్తుందని బీపీటీ సన్న రకం సాగు చేశా. పంట కోసి వారం రోజులైతాంది. పండించిన ధాన్యం అమ్ముకుందామంటే కొనేవాళ్లు లేక ఇబ్బంది పడుతున్నం. రోడ్లమీద పోసుకుని ఎదురుచూస్తున్నం. ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తదో? లేదో? చెప్పడం లేదు. ఇట్ల రోడ్ల మీద పోసుకొని ఎన్నిరోజులుండాలె. వర్షం వస్తే వడ్లు తడుస్తయనే భయం మొదలైంది.

– గంద్రకోట మల్లయ్య, రైతు

# కోల్ కారిడార్‌పై నీలినీడలు

- ప్రతిపాదనల్లోనే రామగుండం-మణుగూరు రైల్వే లైన్
- రైలు కూత కోసం పాతికేళ్లుగా ఎదురుచూపులు
- 2014లో సర్వే కోసం రూ. 10 కోట్లు కేటాయింపు
- తాజాగా రూ. 2,911 కోట్లతో భూ సేకరణకు అంచనాలు
- రూట్ మ్యాప్ లేక సందిగ్ధంలో అధికారులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : పాతికేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమవుతున్న రామగుండం–మణుగూరు రైల్వే లైన్ కలగానే మిగిలిపోతుందా? దీంతో ఈ ప్రాంతం కోల్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందనే స్థానికుల ఆశలు అడియాశలుగానే ఉండనున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రామగుండం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాను కలుపుతూ మణుగూరు వరకు 207 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయనున్న రైల్వే లైన్ పనులు సర్వేలతోనే ఆగిపోతున్నాయి. గతంలో 2014లోనే రూ. 10 కోట్లు కేటాయించి 2017 వరకు సర్వే చేపట్టారు. ఆ తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తాజాగా రైల్వే శాఖ భూ సర్వే, సేకరణ కోసం రూ. 2,911 కోట్ల అంచనాతో నిధులు కేటాయించి బాధ్యతలను ఆయా ప్రాంతాల్లోని ఆర్డీవోలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఇందుకు సంబంధించి విధి విధానాలు ప్రకటించకపోవడం, రూట్ మ్యాప్ అందించకపోవడంతో సర్వేపై సందిగ్ధత నెలకొంది.

**కోల్‌కారిడార్‌గా అభివృద్ధి**

మణుగూరు, భూపాలపల్లి, రామగుండం ఏరియాల్లో నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి అవుతుండగా, దీనిని తరలించేందుకు ఈ మార్గం తప్పనిసరి. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో బొగ్గు రవాణాకు అధిక వ్యయం అవుతున్నది. రామగుండం–మణుగూరు రైల్వే లైన్ పూర్తయితే సుమారు 70 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సులభతరమవుతుంది. దీనివల్ల ఈ ప్రాంతం కోల్‌కారిడార్‌గా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. మణుగూరు నుంచి రామగుండం వరకు 9 రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సింగరేణి అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌లో బొగ్గుతో పాటు ప్రయాణికుల రైలు నడిపే వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రామగుండం నుంచి కొత్తగూడెం మీదుగా మణుగూరు వెళ్లాలంటే 349 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నది. అయితే తాజాగా రైల్వే శాఖ రామగుండం నుంచి మణుగూరు వరకు 207.80 కిలోమీటర్ల పొడవునా సర్వే చేసి, భూ సేకరణ జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. భూపాలపల్లి జిల్లాలోని మల్హర్, భూపాలపల్లి, గణపురం మండలాలతో పాటు పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంథని, రామగిరి మండలాల పరిధిలో సర్వేకు ఆర్డీవో, సబ్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.



### రూట్ మ్యాప్ రాలేదు

రామగుండం–మణుగూరు రైల్వే లైన్‌కు సంబంధించి మాకు ఇంకా ఎలాంటి విధి విధానాలు అందలేదు. రూట్ మ్యాప్ కూడా రాలేదు. భూ సేకరణ చేయాలని మాత్రం ఉత్తర్వులు వచ్చాయి. ఏయే గ్రామాల నుంచి మార్గం వెళ్తున్నదనే మ్యాప్ రావాలి. క్షేత్ర స్థాయిలో ఆదేశాలు వచ్చాకే సర్వే ప్రారంభిస్తాం.

– మంగీలాల్, ఆర్డీవో, భూపాలపల్లి

# మంటల్లో షాపింగ్ మాల్స్

**జనగామలో భారీ అగ్ని ప్రమాదం**

- ఒక్కొక్కటిగా కాలిపోయిన మూడు దుకాణాలు
- రూ.15 కోట్ల ఆస్తి నష్టం.. షార్ట్ సర్క్యూటే కారణం
- 12 గంటల పాటు కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్
- అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 27: జనగామ జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాల్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు కాంప్లెక్స్ చుట్టుపక్కలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో విలువైన వస్త్రాలు కాలి బూడిదయ్యాయి. రూ.15 కోట్ల ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వివరాలిలా ఉన్నాయి. విజయ షాపింగ్ మాల్ నుంచి ఆదివారం ఉదయం 5.30 గంటలకు పొగలు రావడంతో వాకర్స్ గమనించి పోలీసులకు సమాచారమందించగా వారు అక్కడికి చేరుకునే సరికే మంటలు బయటకు వ్యాపించడంతో ఆ ఏరియాకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మాల్ పైఅంతస్తులో ఉన్న గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలడంతో అక్కడున్న జనం ఒక్కసారిగా భయంతో పరుగులుపెట్టారు. గంటన్నర ఆలస్యంగా ఫైర్ ఇంజిన్ ప్రమాద స్థలానికి చేరుకోవడంతో అప్పటికే మంటలు దావానలంలా వ్యాపించాయి. ఒక్క ఫైర్ ఇంజిన్‌తో మంటల్ని అదుపు చేయడం రెస్క్యూ టీమ్‌కు సాధ్యం కాలేదు. ఈలోపు విజయ షాపింగ్ మాల్ పక్కనున్న శ్రీలక్ష్మి షాపింగ్‌మాల్, ఎస్ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణంలోకి మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న విలువైన వస్త్రాలతో పాటు ఫర్నిచర్ ఇతర సామగ్రి కాలిపోయింది. దీంతో నష్టపోయిన బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ రెస్క్యూలో పాల్గొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. జనగామతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, మోత్కూరు, ఆలేరు, భువనగిరి, యాదగిరిగుట్ట నుంచి ఏడు ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను అదుపు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏసీపీ పార్థసారథి నేతృత్వంలో అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపకశాఖ అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంటలను ఫైరింజన్‌తో అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది




మంటల్లో కాలిపోతున్న షాపింగ్ మాల్స్

**ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో ప్రమాదం**

షాపింగ్ మాల్‌లో ఫైర్ సేఫ్టీ ఉంటే చుట్టుపక్కల ఉన్నవారిని అలర్ట్ చేసేలా సైరన్ వినపడేది. జనగామలో ఏ ఒక్క షాపింగ్ మాల్‌కు ఫైర్ సేఫ్టీతో పాటు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ లేదని అధికారులు వెల్లడించారు. కాగా, పక్కనే ఉన్న ముత్తూట్ గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌లో ఉన్న రూ.30 కోట్ల విలువైన బంగారంతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారులు దాచుకున్న రూ.70 కోట్ల బంగారు ఆభరణాలు సేఫ్‌గా ఉన్నాయి. మంటలు అదుపులోకి రాకుంటే భారీ మొత్తంలో ఆస్తినష్టం జరిగేది.

# రోడ్లెక్కని స్వీపింగ్ మిషన్లు

- నాలుగు నెలలుగా షెడ్లకే పరిమితం
- నిర్వహణ టెండర్లలో జాప్యం
- మురికి కూపాలుగా రహదారులు

వరంగల్, అక్టోబర్ 27 : గ్రేటర్ కార్పొరేషన్‌లోని స్వీపింగ్ మిషన్లు మూలన పడ్డాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మిషన్ల టెండర్లు ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో నగర ప్రధాన రహదారులను ఊడ్చే స్వీపింగ్ మిషన్లు బల్దియా కార్యాలయంలో పడి ఉన్నాయి. వీటి వినియోగ బాధ్యతలను ప్రజారోగ్యం విభాగం చూసుకుంటుండగా, టెండర్లను మాత్రం ఇంజినీరింగ్ విభాగం పిలవాల్సి ఉంది. దీంతో రెండు విభాగాల మధ్య సమన్వయ లోపంతో ఈ మిషన్లు మూలన పడ్డాయి.

**టెండర్లలో నిర్లక్ష్యం**

స్వీపింగ్ మిషన్ల టెండర్ ముగిసి సుమారు 6 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బల్దియా అధికారులు మళ్లీ టెండర్లు పిలువలేదు. దీంతో గ్రేటర్‌లోని 12 స్వీపింగ్ మిషన్లు మూలన పడ్డాయి. టెండర్లు పొందిన ఏజెన్సీలు వాటి మెయింటనెన్స్, డ్రైవర్ల వేతనం, వాహనాల రిపేర్లు, డీజిల్ నింపడం తదితర బాధ్యతలను చూసుకుంటాయి. స్వీపింగ్ రూట్ మ్యాపింగ్ చేస్తూ పని చేయించుకోవడం ప్రజారోగ్య విభాగం చూసుకుంటుంది. 6 పెద్ద స్వీపింగ్ మిషన్లు, మరో 6 చిన్న మిషన్లు ఉన్నాయి. ముఖ్యంగా పెద్ద మిషన్లు రాత్రి సమయంలో నగర ప్రధాన రహదారులు స్వీపింగ్ చేస్తుంటాయి.

**ప్రమాదాల బారిన కార్మికులు..**

స్వీపింగ్ మిషన్లు మూలన పడడంతో ప్రధాన రహదారులపై కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా స్వీపింగ్ మిషన్లు రాత్రి సమయంలోనే మెయిన్ రోడ్లు, డివైడర్ల మధ్య పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేస్తుంటాయి. ప్రస్తుతం స్వీపింగ్ మిషన్లు రోడ్డెక్కక పోవడంతో కార్మికులే ప్రధాన రహదారులను శుభ్రం చేస్తున్నారు.

తెల్లవారుజామున ప్రధాన రహదారులు, డివైడర్ల మధ్య శుభ్రం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల హనుమకొండ లైఫ్‌లైన్ ఆస్పత్రి సమీపంలో మెయిన్ రోడ్డు డివైడర్ వద్ద శుభ్రం చేస్తున్న కార్మికురాలు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. నగర ప్రధాన రహదారులను ఊడ్చేందుకు స్వీపింగ్ మిషన్లను కొనుగోలు చేసిన బల్దియా అధికారులు వాటి నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.




నాలుగు నెలలుగా బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉన్న స్వీపింగ్ మిషన్లు

## తవ్వకాల్లో బయటపడిన అమ్మవారి విగ్రహం

**పూజలు చేసిన జనం**

వరంగల్, అక్టోబర్ 27 : నగరంలోని ములుగు రోడ్డు పెట్రోల్ పంప్ వెనుక భాగంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాల్లో అమ్మవారి విగ్రహం బయట పడింది. ఆదివారం చేపట్టిన తవ్వకాల్లో అమ్మవారి విగ్రహం వెలుగు చూసిన విషయం తెలుసుకున్న స్థానికులు భారీగా అక్కడికి చేరుకుని ఆ విగ్రహాన్ని పెద్దమ్మ తల్లిగా భావించి పూజలు చేశారు. పెద్దమ్మ గడ్డగా పిలిచే ఈ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం వెలుగుచూడడంతో పెద్దమ్మ తల్లిగా ప్రజలు చెప్పుకుంటున్నారు. ఈ విషయం నగరమంతా వ్యాపించడంతో చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకొని అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు.



పూజలందుకుంటున్న అమ్మవారి విగ్రహం

# సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలి

- లేదంటే అందరిపై చర్యలు తీసుకోవాలి
- 4వ బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 27 : రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ సిబ్బందికి ఒకే విధానాన్ని అమలు చేయాలని కోరిన తమను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్లు ధర్నా నిర్వహించారు. ఆదివారం విరామ సమయంలో ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి, ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, లేదంటే నిరసన తెలుపుతున్న కానిస్టేబుళ్లందరినీ సస్పెండ్ చేయాలన్నారు. తమ కష్టాలను తీర్చాలని కోరిన వారిని విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరిస్తున్నదన్నారు. కానిస్టేబుళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై విచారణ జరిపి తగిన న్యాయం చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. బెటాలియన్ గేటు వద్ద కానిస్టేబుళ్లు చేస్తున్న ధర్నాకు వారి కుటుంబసభ్యులు మద్దతు తెలిపారు. కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టడంతో మామునూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




మామునూరు నాల్గో బెటాలియన్ వద్ద బైఠాయించిన కానిస్టేబుళ్లు

**5వ బెటాలియన్‌లో ఆరుగురు సస్పెన్షన్**

గోవిందరావుపేట : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయి శివారు లక్నవరం క్రాస్ వద్ద ఉన్న 5వ పోలీస్ బెటాలియన్‌లో పని చేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రాష్ట్రమంతా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే.

దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో హెడ్ కానిస్టేబుళ్లు రాజేశ్, రాజు, కానిస్టేబుళ్లు సతీశ్, రమేశ్, అభినవ్, రామ్‌దాస్ ఉన్నారు.